సవాళ్ల పరిష్కారానికి సాంకేతికతను ఉపయోగించాలి

యూజీసీ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం జగదీష్‌కుమార్


యూజీసీ ఛైర్మన్ ప్రొఫెసర్ జగదీష్‌కుమార్‌తో ముచ్చటిస్తున్న వీసీ ప్రొఫెసర్ బీజేరావు

రాయదుర్గం: ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లకు పరిష్కారాలను కనుగొనడానికి సాంకేతిక పురోగతిని ఉపయోగించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం జగదీష్‌కుమార్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఎంటర్‌ప్రైజెస్(ఎస్పైర్) అసోసియేషన్ ఫర్ సైంటిఫిక్ పర్సూట్స్ 6వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుతం జీవ వైవిధ్యం మరొక ముఖ్యమైన సమస్యగా మారిందని, దీన్ని పరిక్షించడానికి అందరూ కృషి చేయాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విధులను సక్రమంగా నిర్వహిస్తూనే ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నా రు. మన దేశంలో మహిళలు సాధిస్తున్న ప్రగతిని మనం చూడాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు పెంచడంలో రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు ఎస్పైర్ బయోనెస్ట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ అనీల్‌కొండ్రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో 1.3 మిలియన్ల మంది మృత్యువాత


సమావేశంలో పాల్గొన్న సయ్యద్ అలీ, వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ తదితరులు

రాయదుర్గం: భారతదేశంలో గత దశాబ్దకాలంలోనే రోడ్డు ప్రమాదంలో 1.3 మిలియన్ల మంది మృత్యువాత పడ్డారని యూనిసెఫ్ ఇండియా హెల్త్ స్పెషలిస్ట్ సయ్యద్ అలీ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో రోడ్డు భద్రతపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచబ్యాంకు నివేదిక ప్రకారం మృత్యువాతలతోపాటు మరో 5 మిలియన్ల మంది గాయపడ్డారని ఆయన వివరించారు. పిల్లల ఆరోగ్యం, మనుగడ, విద్య, రక్షణ భాగస్వామ్యం అవసరమన్నారు. ఆరోగ్యం శ్రేయస్సు, ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేసే ఒక ప్రధాన ప్రపంచ అభివృద్ధి సవాలుగా మారిందన్నారు. మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ విభాగం డీన్, హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్ మాట్లాడుతూ ఔత్సాహిక జర్నలిస్టులు, మీడియా నిపుణులు ట్రాఫిక్ పై అవగాహన కల్పించడం అవసరమన్నారు. వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘ది లైట్’ యానిమేషన్ చిత్రం ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: బ్రహ్మ కుమారీస్ వ్యవస్థాపకులైన ప్రజాపిత బ్రహ్మ జీవిత చరిత్రను తెలియజేసే ‘ది లైట్’ యానిమేషన్ చిత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. బ్రహ్మ కుమారీస్ గాడ్లీవుడ్ స్టూడియోస్ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ చిత్రాన్ని నగరంలోని పీవీఆర్ నెక్స్ట్ గెలేరియా వేదికగా విడుదల చేశారు. ఆధ్యాత్మికవేత్తగా, స్ఫూర్తి ప్రదాతగా మహోన్నతమైన వ్యక్తిత్వ విలువలను ప్రపంచానికి తెలిపిన ‘ప్రజాపిత బ్రహ్మ’ ఆలోచనల సమాహారంగా ఈ చిత్రాన్ని రూపొందించామని నిర్వాహకులు తెలిపారు. డైరెక్టర్ కులదీప్ బెహంజి, సికింద్రాబాద్ సబ్ జోన్ శాంతి సరోవర్ మంజు బెహంజి పాల్గొన్నారు.

మోదీ బహిరంగ సభకు ఏర్పాట్లు


పటాన్‌చెరులో మోదీ సభ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్

పటాన్‌చెరు: పటాన్‌చెరు శివారులోని పటేల్‌గూడ సమీపంలో ఈనెల 5వ తేదీన ప్రధాని మోదీ బహిరంగ సభ నిర్వహించేందుకు అనువైన స్థలాన్ని శుక్రవారం కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్ పరిశీలించారు. వీరివెంట బీజేపీ మెదక్ పార్లమెంట్ ప్రభారి బసవ లక్ష్మయ్య, పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఉన్నారు.

‘స్వీప్’ ద్వారా ఓటింగ్‌పై అవగాహన

సంగారెడ్డి టౌన్: ‘స్వీప్’ కార్యక్రమం ద్వారా ఓటింగ్ పై అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతీ శుక్రవారం హేతుబద్ధీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిశీలించి సరి చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. శుభకార్యాల కోసం తీసుకెళ్లే నగదు పట్టుకుంటే వెంటనే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టుబడిన నగదు జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ అందిస్తామని, సరైన పత్రాలు చూపించి తీసుకువెళ్లవచ్చని పేర్కొన్నారు.

త్వరలో ప్రజాపాలన సేవా కేంద్రాలు

త్వరలో ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మున్సిపాలిటీ, ఎంపీడీఓ కార్యాలయాల్లో వీటిని ఏర్పాటు చేస్తామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో మాట్లాడారు. ఇంటర్, టెన్త్ పరీక్షలు, ప్రజాపాలన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని పని దినాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలు కొనసాగుతాయని వివరించారు. ఆయా కేంద్రాల్లో ఒక అధికారి, ఆపరేటర్ ఉండేలా చూస్తున్నామని తెలిపారు. కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు కల్పిస్తామన్నారు. టెన్త్, ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థుల అవగాహన

సంగారెడ్డి: ప్రతి ఒక్కరూ డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు తోడ్పడాలని డీఎంఏ డాక్టర్ వాణి పిలుపునిచ్చారు. శుక్రవారం సంగారెడ్డి మెడికల్ కళాశాల విద్యార్థులు స్థానిక ఐబీ ఎదుట ప్రదర్శనలు నిర్వహించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ క్రాంతి హాజరై తిలకించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ సుధ, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిల్ కుమార్, ఆర్ఎంఓలు ఆంజనేయులు, రవి కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి మల్లన్న ఉత్సవాలు షురూ


మణికొండ మల్లన్న ఆలయం

మణికొండ: మణికొండ మల్లన్న ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నట్లు బీరప్ప, మల్లన్న ఆలయ కమిటీ ఛైర్మన్ బి.జైహింద్‌రావు, అధ్యక్షుడు బి. ముత్యాలు, ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మణ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం గంగకు వెళ్లడం, రాత్రికి మల్లన్న ఒగ్గుకథతో షురూ అయ్యి సోమవారం మధ్యాహ్నం వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కొట్నం, 11:32 గంటలకు మల్లన్న స్వామి కల్యాణం, మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నదానం, 2:30 గంటలకు సదర్‌పటం, గొలుసులు తెంపుట, 3 గంటలకు అగ్ని గుండాలు తొక్కడం, సాయంత్రం 5 గంటలకు ఎల్లమ్మ బోనాలు, రాత్రి 9 గంటలకు మల్లన్న చరిత్ర ఒగ్గుకథ ఉంటాయని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఒడిబియ్యం అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. ఒగ్గు వీరేశం ఆధ్వర్యంలో కథలు, కల్యాణాలు, పెద్ద కురుమ జె.భిక్షపతి, చిన్న కురుమ బి.నర్సింహా ఆధ్వర్యంలో ఉత్సవాలు, దొడ్డి సత్తయ్య- వరలక్ష్మి, దొడ్డి శ్రీకాంత్-రేవతి దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మణికొండ: వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నార్సింగి క్రైం సీఐ శ్రీనివాస్ సూచించారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాలలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఖానాపూర్, గండిపేట ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయణించేవారు సీటు బెల్టును తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం తాగి నడపవద్దని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్యం 73,624 మంది చిన్నారులు

- శేరిలింగంపల్లి మండల పరిధిలో ఏర్పాట్లు
- 3న పల్స్ పోలియో కార్యక్రమం, 4,5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పల్స్ పోలియో

పల్స్‌పోలియో నిర్వహణకు సర్వం సిద్ధం



శేరిలింగంపల్లి: పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధంచేశారు. శేరిలింగంపల్లి మండల పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం ఏర్పాటుకు అధికారులు ఇప్పటి నుంచే తగిన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈకార్యక్రమం విజయవంతం చేయడానికి ఆయా కేంద్రాల్లో పనిచేసేందుకు వైద్య సిబ్బందితో పాటు అశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, వాలంటీర్ల సహకారంతో నిర్వహించాలని వైద్యాధికారులు నిర్ణయించారు.

లక్ష్యం..73,624 మంది చిన్నారులు

- శేరిలింగంపల్లి సర్కిల్‌లోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్ల పరిధిలోని ఐదేళ్ల ఏళ్ళ చిన్నారులు మొత్తం 73,624 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా ఉన్నతాధి కారులు నిర్దేశించారు.
- మార్చి 3న పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.
- అదేవిధంగా మార్చి 4,5 తేదీలలో ఇంటింటికివెళ్లి పల్స్ పోలియోచుక్కలు వేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.
- సర్కిల్ పరిధిలో 12రూట్లలో134 పల్స్ పోలియో బూత్‌లు, ప్రతి కేంద్రానికి నలుగురు చొప్పునవిధులు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.
- ముందస్తుగా 3 మొబైల్ టీమ్‌లు, ఆయా టీమ్‌లు 43 హైరిస్క్ ఏరియాల్లో పర్యటించి పల్స్ పోలియో చుక్కలు వేస్తారు.
- మండల పరిధిలో 8 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేశారు. -మియాపూర్, మాదాపూర్, హైటెక్ సిటీ, రాయదుర్గం మెట్రో స్టేషన్‌లతో పాటు లింగంపల్లి రైల్వే స్టేషన్ 1,6 ప్లాట్ ఫామ్స్, హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్, మియాపూర్ చౌరస్తాలోని బస్‌స్టాప్‌లలో ప్రత్యేకం గా ప్రయాణం చేస్తున్నవారికి కూడా పోలియో చుక్కలు వేయాలని ఏర్పాటు చేస్తున్నారు.

ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌కు క్వాల్‌కామ్ గ్రాంట్

రాయదుర్గం: ఎడ్జ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స రీసెర్చ్‌కు మద్దతు ఇవ్వడానికి ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌కు క్వాల్‌కామ్ సంస్థ గ్రాంట్‌ను అందించింది. క్వాలకామ్ టెక్నాలజీస్ సీనియర్ ఉపాధ్యక్షుడు లీండర్ట్‌వాన్‌డోర్న్ క్వాల్ కామ్ ఎడ్జ్ ఏఐ ల్యామ్‌ను శుక్రవారం ప్రారంభించారు. క్వాల్‌కామ్ ఎడ్జ్ ఏఐ ల్యాబ్ ఎడ్జ్, ఫండ్ రీసెర్చ్ స్కాలర్‌షిప్‌ల కోసం అల్గారిథమ్‌లపై పనిచేస్తుంది. క్వాల్‌కామ్ ద్వారా 186 అమెరికన్ డాలర్ల గ్రాంట్‌ను ప్రకటించింది. దీన్ని రాబోయే మూడేళ్ళపాటు ఎడ్జ్ ఏఐ రంగంలో పరిశోధన కోసం ఉపయోగిస్తారు.

14 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించినట్లు పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం, గురువారం నిర్వహించిన ఈ డ్రైవ్‌లో 14 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమాన విధించినట్లు పేర్కొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటుదాం

జిన్నారం(పటాన్‌చెరు): రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సత్తా చూపాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పిలుపునిచ్చారు. మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధి బీఆర్ఎస్ నేత ఆనంద్‌కృష్ణారెడ్డి తోపాటు పలువురు నాయకులు శుక్రవారం బీజేపీలో చేరారు. వారికి గోదావరి కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

పటాన్‌చెరు టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర సైన్స్ అకాడమీ తరపున జాతీయ సాంకేతిక సంస్థ వరంగల్ విశ్రాంత ఆచార్యులు రామచంద్రయ్య, ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంతి ఆచార్యులు బీఎస్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నోబెల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్ చేసిన పరిశోధనలు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు యోగిబాబు శ్రీహరిరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



మియాపూర్: ఇంటినుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు.. మియాపూర్ జనప్రియ వెస్ట్ సిటీ కాలనీలో నివాసముంటున్న ముకుంద్ సాగర్ కూతురు (18) గత నెల 26న రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించింది. మరుసటి రోజు ఉదయం చూసే సరికి ఇంట్లో కనిపించేదు. రాత్రి అయిన కూడా ఎంతకి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో ఎంతవెతికినా లభ్యం కాలేదు. దీంతో తండ్రి మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బీరంగూడ మండే మార్కెట్ సమీపంలోని శంభునికుంటలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి సుమారు 30 నుంచి 35 వయసు గల మృత దేహం కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు... మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ముఖ్యమైన ఖనిజాలు, లోహాల వెలికితీత ఎంతో అవసరం

ఎన్ఎండీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి సాహూ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎన్ఎండీసీ ఈడీ బి సాహూ, ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: భారతదేశంలో ముఖ్యమైన ఖనిజాలు, లోహాల వెలికితీత ఎంతో అవసరమని ఎన్ఎండీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి సాహూ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని చాణక్య హాల్‌లో మూడు రోజుల జాతీయ స్థాయి సెమినార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధికి, ప్రస్తుత జీవన ప్రమాణాలకు ముఖ్యంగా ఇనుప ఖనిజం, బొగ్గు, అల్యూమినియం, ఇతర ఖనిజాల ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి అవసరమన్నారు. దీనికోసం ఒక జాతీయ విధానం, ఉక్కు ఉత్పత్తి పెంపు చాలా అవసరమన్నారు. ఇంధన అవసరాలను దృష్టిలో పెట్టుకొని భారత ప్రభుత్వం బొగ్గు మంత్రిత్వశాఖ ద్వారా 2025 నాటికి 1.5 బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అవసరమన్నారు. సదస్సులో 24 టెక్నికల్ పత్రాలను, మరో 29 సాధారణ పత్రాలను విద్యార్థులు సమర్పించారు. డాక్టర్ కౌశిక్‌సర్కార్, డాక్టర్ ఎస్‌కే చౌరాసియా, డాక్టర్ బాలమదేశ్వరన్, సురేష్‌కుమార్‌జైన్, ఎస్కీ అధికారులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తెలుగు రుచుల వేదికగా ‘అంతేరా’..



సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాయలసీమ సమ్మిళిత వినూత్న ఆహార రుచుల కేంద్రంగా ‘అంతేరా కోర్ట్‌యార్డ్ రెస్టారెంట్’ ప్రారంభమైంది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని వట్టినాగులపల్లి ప్రధాన్ కన్వెన్షన్ వేదికగా ఈ నూతన రెస్టారెంట్‌ను యువ వ్యాపారవేత్తలు హరీష్ రెడ్డి, సామిత్ రెడ్డి, హర్ష రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ.. తెలుగు వంటకాల్లోని వైవిధ్యాన్ని, ఆరోగ్య రహస్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలనే లక్ష్యంతో అంతేరాను ఆవిష్కరించామని అన్నారు. ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ వంటల వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు గొప్ప ప్రకృతి వేదికలో అందించేలా దీనిని రూపొందించామన్నారు. నగరం వేదికగా అంతర్జాతీయ కాంటినెంటల్ డిష్‌లను సైతం మైమరిపించేలా ఇక్కడి తెలుగు వంటకాలు సంతృప్తిని స్తాయని ఆయన పేర్కొన్నారు.

దేశంలోనే అగ్రగామిగా తెలంగాణ


విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

రాయదుర్గం/మాదాపూర్: పర్యాటక రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలుపుతామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన గచ్చిబౌలిలోని ‘నిథమ్’ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో దేశంలోనే అత్యుత్తమ పర్యాటక అతిథ్య ఉన్నత విద్యా శిక్షణ సంస్థగా ‘నిథమ్’ను అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటక, ఆతిథ్య రంగానికి ప్రాధాన్యం పెరుగుతుందని, దీంతో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. నిథమ్‌లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు ఉపకరణాలు, కొత్త కోర్సులు, తదితర అంశాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నిథమ్ నిర్వహణపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ పర్యాటకులను దృష్టిలో ఉంచుకుని గైడ్స్‌కు ఫారెన్ లాంగ్వేజ్ కోర్సులు నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు, ఇందుకు ‘ఇఫ్లూ’తో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

శిల్పారామం సందర్శన...

మాదాపూర్‌లోని శిల్పారామాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించారు. అనంతరం శిల్పారామంలోని ఎత్నిక్ హాల్‌లతో శిల్పారామం నిర్వహణ, అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ శిల్పారామానికి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. శిల్పారామం ఆదాయం పెరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మధుమేహం, రక్తపోటు లేదు..

గుండెపోటు వచ్చింది!

వెంటనే స్టంట్ వేసి ప్రాణాలు కాపాడిన అమోర్ ఆస్పత్రి వైద్యులు

కూకట్‌పల్లి: ఓ వ్యక్తికి గుండెలోని వెసెల్ 99శాతం బ్లాక్ అయ్యింది. వైద్యులు వెంటనే గుర్తించి స్టంట్ వేసి అతడి ప్రాణాలు కాపాడారు. ఈ సంఘటన కూకట్‌పల్లిలోని అమోర్ ఆస్పత్రిలో జరిగింది. అమోర్ ఆస్పత్రి కన్సల్టెంట్ కార్డియాలజిస్టు డాక్టర్ ఇమ్రాన్ ఉల్ హక్ వివరాలు వెల్లడించారు. 48 ఏళ్ల వయసు ఉన్న మధు అనే వ్యక్తికి మధుమేహం, రక్తపోటు లాంటివి ఏమీ లేదు. ఉదయం కాస్త నొప్పిగా అనిపించటంతో ఆస్పత్రికి వచ్చాడు. అతడికి వైద్య పరీక్షలు చేయగా ఎటువంటి రోగ లక్షణాలు లేవు. ఒక వాల్వు సరిగా కదలటం లేదు. లక్షణాలను బట్టి యాంజియోగ్రామ్ చేశారు. కాసేపట్లో అతనికి గుండె నొప్పి వచ్చింది. దీంతో వైద్యులు వెంటనే స్పందించి అతడికి యాంజియో చేశారు. గుండె వెసెల్‌లో 99శాతం పూడిక ఉంది. దీంతో ఆయనకు స్టంట్ వేశామని తెలిపారు.

స్టంట్ వేశారు..

ఈ సందర్భంగా రోగి మధు మాట్లాడుతూ.. తాను కర్మాగారంలో మిషిన్ ఆపరేటర్‌గా పనిచేస్తానని తెలిపారు. రోజు లాగా డ్యూటీకి వెళ్లి పనిచేస్తుండగా ఎడమ చెయ్యి కాస్త నొప్పిగా ఉందనిపించిందని తెలిపారు. కొంచెం సేపు విశ్రాంతి తీసుకున్నానని తెలిపారు. తరువాత తిరిగి 10 నిమిషాల్లో నొప్పి వచ్చి చెమటలు పట్టాయని పేర్కొన్నారు. వెంటనే అమోర్ ఆస్పత్రి వైద్యులను సంప్రదించాను. ఇక్కడ వైద్య పరీక్షలు చేసి వెంటనే స్టంట్ వేశారు. వారం రోజులు విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు.

సీఆర్ ఫౌండేషన్‌లో మహిళలకు నైపుణ్య శిక్షణ కేంద్రం

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర రెడ్డి రీసర్చ్ సెంటర్‌లో ఉచితంగా మహిళలకు కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్‌కు సంబంధించిన పరిజ్ఞానం, ట్యాలీ, డీటీపీ తదితర శిక్షణలు ఉచితంగా అందిస్తున్నారు. సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లుగా, ఒకోక్క బ్యాచ్‌కు మూడు నెలల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాల మధ్యలో గల చిన్నారులు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. వివరాలకు 9603196925 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

ఏ19 క్లబ్ కిచెన్ ప్రారంభం



గచ్చిబౌలి: నైట్ క్లబ్ థీమ్‌తో ఏ19 క్లబ్, కిచెన్‌ను పలువురు సినీ తారలు ప్రాంభించి సందడి చేశారు. కొత్తగూడలోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్‌లో సినీ తారలు దీక్షా పంత్, రుచిత సాదినేని, చందన జయరాంలు ఏ19 క్లబ్, కిచెన్‌ను ప్రారంభించారు. నైట్‌క్లబ్ థీమ్‌తో కైనెటిక్ లైట్లు, ఫ్రీజర్ బాక్సులు, టన్నెల్ వ్యూ ఫొటో బూత్ ఉన్నాయి. నైట్ లైఫ్ వారికి మ్యూజిక్, రుచికరమైన ఫుడ్, పల్సేటింగ్ బీట్‌లు, వివిధ రకాల పనియాలు ఉంటాయి. ఈ కార్యక్రమంలో సన్నీ, అనీల్‌రాథోడ్, శ్రీసత్య, ఇనయ, గీతూ రాయల్, జెస్సీ తదితరులు పాల్గొన్నారు.

భార్య ప్రతిమతో వివాహ వార్షికోత్సవం


భార్య ప్రతిమతో భర్త సత్యనారాయణ

జిన్నారం(పటాన్‌చెరు): అనారోగ్యంతో భార్య మృతి చెందింది. దీంతో ఆమె ప్రతి రూపాన్ని ఏర్పాటు చేసి వివాహ వార్షికోత్సవాన్ని జరిపించిన ఉదంతం జిన్నారం మండలంలో వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి.. గుమ్మడిదల గ్రామానికి చెందిన చెన్నంశెట్టి సత్యనారాయణ, నాగలక్ష్మిల వివాహం జరిగి 49 ఏళ్లు అయ్యింది. 50వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని ఆశపడ్డారు. గత ఏడాది ఫిబ్రవరి 5న ఆమె అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారంతో వీరి వివాహం జరిగి 50 ఏళ్లు అవుతుండటంతో అమ్మ, నాన్నల కోరికను తీర్చాలని కుమారులు కోటేశ్వర్‌రావు, జయసారధి, సూర్యనారాయణ, శ్రీనివాస్, ఉదయ్‌కుమార్ తలచారు. ఏకంగా అమ్మ ప్రతిమను రూపొందింపజేశారు. తల్లిదండ్రుల వార్షికోత్సవాన్ని జరిపించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: కోకాపేట సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సందీప్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైర్లకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్న నేపథ్యంలో ఓషియన్ పార్క్, బాబుఖాన్ విల్లాస్, 250 గజాల కాలనీ, లెజెండ్ విల్లాస్, పావని విల్లాస్, గండిపేట నుంచి శంకర్‌పల్లి రోడ్డు, ఘర్ కార్పొరేషన్, మైహోం లేబర్ క్యాంప్, అక్షయపాత్ర రోడ్, ప్రైవేట్ 28 విల్లాల ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్ సస్పెన్షన్

మణికొండ: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడనే ఆరోపణలపై కాంగ్రెస్ కౌన్సిలర్‌ను జిల్లా అధ్యక్షుడు పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. మణికొండ మున్సిపాలిటీ ఏడో వార్డు, నెక్నాంపూర్‌కు చెందిన కౌన్సిలర్ బి. పద్మారావు ఇటీవల మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్‌పై అవిశ్వాసం పెట్టేందుకు కలెక్టర్‌కు ఇచ్చిన లేఖపై సంతకం చేశారు. అలాగే అవిశ్వాస తీర్మానం రోజు సమావేశానికి హాజరై చైర్మన్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. దాంతో గతంలోనే ఆయనకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. సరైనా వివరణ ఇవ్వక పోవడంతో ప్రాథమిక సభ్యత్వం రద్దు చేసి, పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు చల్లా నర్సింహారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జీరో కరెంట్ బిల్లుల పంపిణీ షురూ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో జీరో బిల్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఆ శాఖ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. సిబ్బంది ఇంటింటికీ తిరు గుతూ రీడింగ్‌ను సరి చేస్తూ బిల్లులు అందజేశారు. ఈ సందర్భంగా జీరో బిల్లులు వచ్చిన వారు హర్షం వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ సబ్ స్టేషన్ పరిధిలో దాదాపు 4500 మంది లబ్ధిదారులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

మూసీ ఆక్రమణలు తొలగించండి

మణికొండ: గండిపేట మండలం, మంచిరేవుల రెవెన్యూ పరిధిలో మూసీ నది పక్కనే రాజపుష్ప అనే సంస్థ నిర్మాణాలు చేపట్టి స్థల ఆక్రమణకు యత్నిస్తున్నారని వాటిని వెంటనే తొలగించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్ రావు ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం మూసీ నదిని అభివృద్ధి చేసేందుకు సుందరీకరణ , పర్యాటకంగా అభివృద్ధి చేసే దిశగా పనిచేస్తుంటే మంచిరేవులలో మాత్రం రాజపుష్ప సంస్థ దాన్ని మూసి వేస్తుందన్నారు. అధికారులు స్పందించి అనుమతులు రద్దు చేసి, ఆక్రమణలను తొలగించాలని విన్నవించామన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సభ్యుడు ఓరుగంటి యాదయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మల్లేష్, సీపీఐ మండల కార్యదర్శి ఎం. బాబురావు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

మణికొండ: కోకాపేట గ్రామంలో శంకర కంటి ఆసుపత్రి వారు, గ్రామ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ పీసీసీ సభ్యుడు, కోకాపేట మాజీ సర్పంచ్ ముంగి జైపాల్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండిపేట మండలం పక్కనే ఉన్నత ప్రమాణాలతో కంటి ఆసుపత్రి ఏర్పాటు చేసి పేద ప్రజలకు ఉచితంగా సేవలు అందించడం అభినందనీయమన్నారు. అలాగే నియోజకవర్గవ్యాప్తంగా సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది, రెడ్డి సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.